మైథిలి, అక్షర, వినయ్ (ఫైల్)

చెరువులో మునిగి నలుగురు మృతి

- తల్లితోపాటు ముగ్గురు పిల్లలు మృత్యువాత
- చెరువులో బట్టలు ఉతుకుతుండగా ప్రమాదం
- కామారెడ్డి జిల్లా వెంకటాపూర్‌లో విషాదం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 30: కామారెడ్డి జిల్లాలో పండుగ పూట విషాదం నెలకొన్నది. చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. తల్లితోపాటు ముగ్గురు పిల్లలు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం భిక్నూర్ పంచాయతీ పరిధిలోని వెంకటాపూర్ అగ్రహారంలో చోటుచేసుకున్నది. వెంకటాపూర్ అగ్రహారానికి చెందిన బొమ్మర్థి లింగయ్య (ఏసు) భార్య మౌనిక (25) శనివారం మధ్యాహ్నం పెద్ద చెరువు బ్యాక్ వాటర్‌లో బట్టలు ఉతకడానికి.. పిల్లలు మైథిలి (10), అక్షర (9), వినయ్ (7)ని వెంట తీసుకెళ్లింది. మౌనిక బట్టలు ఉతుకుతుండగా, ముగ్గురు పిల్లలు స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. చెరువులో పూడికతీయడం వల్ల లోతుగా గుంతలు ఉండటంతో పిల్లలు అందులో పడిపోయారు. గట్టిగా కేకలు వేయడంతో వారిని రక్షించడానికి నీటిలోకి దిగిన మౌనిక సైతం వారితోపాటు మునిగిపోయింది. హమాలీ పనిచేసే లింగయ్య సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. భార్యా పిల్లలు కన్పించకపోవడంతో తన తండ్రి చిన్న లక్ష్మయ్యతో కలిసి గాలించారు. చివరికి చెరువు బ్యాక్ వాటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నలుగురికి సంబంధించిన దుస్తులు, చెప్పులు కనిపించడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని చెరువులో గాలించగా.. అర్ధరాత్రి సమయంలో మౌనిక, మైథిలి, వినయ్ మృతదేహాలు బయటపడ్డాయి. ఆదివారం ఉదయం అక్షర మృతదేహం లభ్యమైంది. లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు.

బల్లిపడ్డ చట్నీ తిని నలుగురికి అస్వస్థత

గద్వాల అర్బన్, మార్చి 30 : బల్లి పడ్డ చట్నీ తిని నలుగురు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో చట్నీలో బల్లి పడింది. అది గమనించని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు టిఫిన్ కోసం వచ్చిన పలువురికి చట్నీ వడ్డించగా అందులో చనిపోయిన బల్లి బయట పడింది. అనంతరం కొంత సమయానికే నలుగురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ దవాఖానకు వెళ్లి వారి వివరాలు తెలుసుకున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెల్లడించారు.

రోడ్ నెట్‌వర్క్‌లో తెలంగాణ భేష్!

- రాష్ట్రంలో ప్రతి 100 చ.కి.మీ.లకు 99.29 కిలోమీటర్ల డెన్సిటీ
- ఎన్‌హెచ్‌ల సగటు 4.41 శాతమే
- బీఆర్ఎస్ పాలనలో అత్యధిక రోడ్లు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రోడ్ నెట్‌వర్క్‌లో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించింది. రాష్ట్రంలో రోడ్ల డెన్సిటీ ప్రతి 100 చ.కి.మీలకు 99.29 కిలోమీటర్లు ఉండడమే అందుకు నిదర్శనం. ఈ రహదారుల్లో గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిర్మించిన రహదారులే ఎక్కువగా కావడం విశేషం. జాతీయ రహదారుల సగటు డెన్సిటీ 4.41 శాతం మాత్రమే.

సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం...

ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ప్రకారం.. ప్రస్తుతం తెలంగాణలో రోడ్ డెన్సిటీ(సాంద్రత) సగటున ప్రతి చదరపు కిలోమీటర్‌కు 99.29 కిలోమీటర్లుగా ఉంది. హైదరాబాద్‌లో ఇది ఇంకా ఎక్కువ. మహానగరంలో ప్రతి 100 చ.కి.మీ.ల వైశాల్యానికి 1,332.85 కిలోమీటర్లుగా ఉంది. మేడ్చల్ మల్కాజిగిరిలో 385.43 కిలోమీటర్లు, రంగారెడ్డిలో 158.36 కిలోమీటర్లు, అతి తక్కువగా ములుగులో 41.25 కిలోమీటర్లు, భద్రాద్రి కొత్తగూడెంలో 61.01 కిలోమీటర్లుగా ఉంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల డెన్సిటీ ప్రతి 100 చ.కి.మీల వైశాల్యానికి కేవలం 4.45 కిలోమీటర్లు ఉండగా, జాతీయ సగటు 4.41 కిలోమీటర్లుగా ఉంది. తెలంగాణలో రోడ్ల డెన్సిటీ ఎంతో మెరుగ్గా ఉన్నట్టు దీనిబట్టి స్పష్టమవుతున్నది. తెలంగాణ ఏర్పాటయ్యాక పదేండ్ల పాటు బీఆర్ఎస్ సర్కారు అత్యధికంగా రోడ్లను నిర్మించడంతోనే ఈ ఘనత సాధ్యమైంది. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉన్న విషయం విదితమే. జాతీయ రహదారులు కూడా చాలా తక్కువగా ఉండేవి. రోడ్లన్నీ గుంతలమయమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ రహదారులను పెద్దయెత్తున నిర్మించింది. గ్రామాల్లోని రోడ్లతోపాటు మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వెళ్లే రహదారులను అభివృద్ధి చేసింది. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని జాతీయ, రాష్ట్ర రహదారులతో అనుసంధానం చేసింది. ముఖ్యంగా గ్రామాల్లో పెద్దయెత్తున సీసీ రోడ్లను నిర్మించింది. ఫలితంగా రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ తదితర శాఖల పరిధిలో అన్నిరకాల రహదారులు కలుపుకొని మొత్తం రోడ్ నెట్‌వర్క్ 1,11,730 కిలోమీటర్లకు చేరుకున్నది. ఇందులో సగానికి పైగా బ్లాక్‌టాప్ రోడ్లు ఉండగా, మిగిలినవి సీసీ, మెటల్ రోడ్లు.

రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్ వివరాలు (కిలోమీటర్లు)

ఆర్‌అండ్‌బీ రోడ్లు	29,240.28 (26.16%)
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ (పీఆర్ఈడీ, గ్రామీణ రోడ్లు)	68,539.27 (61.32%)
జీహెచ్ఎంసీ రోడ్లు	9,013.01 (8.06 %)
జాతీయ రహదారులు	4,983 (4.46%)
మొత్తం –	1,11,730.56

బీఆర్ఎస్ హయాంలో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్మించిన రోడ్లు (కిలోమీటర్లు)

వేడల్పు	కిలోమీటర్లు
రెండు లేన్లు	8,218
నాలుగు లేన్లు	321
ఆరు లేన్లు	39
మొత్తం	8,578

బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి చేసిన రోడ్ల వివరాలు...

- రూ.17,360 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 10,585 కిలోమీటర్ల మేర సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్ రోడ్లుగా అభివృద్ధి చేశారు.
- మండలాలను జిల్లా కేంద్రాలకు కలిపేందుకు రూ.2,727 కోట్లతో 1,875 కిలోమీటర్ల మేర డబుల్ లేన్ రోడ్ల నిర్మాణం చేపట్టగా.. అందులో 1,685 కిలోమీటర్లు పూర్తిచేశారు.
- రూ.11,191 కోట్లతో 4,517 కిలోమీటర్ల మేర ముఖ్యమైన ప్రాంతాలు, మార్కెట్లను కలిపేందుకు మేజర్ రోడ్లు, జిల్లా రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేశారు.
- సెంట్రల్ రోడ్ ఫండ్(సీఆర్ఎఫ్) కింద రూ.3,442 కోట్లతో 3,061 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టి, అందులో 2,377 కిలోమీటర్లు పూర్తిచేశారు.
- రూ.3,134 కోట్లతో 717 వంతెనల పునరుద్ధరణ, విస్తరణ పనులు చేపట్టగా, అందులో 382 పూర్తయ్యాయి.
- తొమ్మిదేండ్లలో 8,218 కిలోమీటర్ల మేర రెండు లేన్ల రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇది గత 56 ఏండ్లలో నిర్మించిన రెండు లేన్ల రోడ్ల కంటే అధికం.
- 321 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్ల నిర్మాణం పూర్తి.
- 39 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల రోడ్ల నిర్మాణం పూర్తి.
- రాష్ట్ర ఏర్పాటు తర్వాత రూ.4,603 కోట్లతో 13,000 కిలోమీటర్ల మేర రోడ్ల పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు.
- 184 బ్రిడ్జ్ కమ్ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టగా, 141 పూర్తయ్యాయి.
- రూ.865 కోట్లతో 28 రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌వోబీలు/ఆర్‌యూబీల నిర్మాణం పూర్తిచేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో మొత్తం ఆర్‌వోబీలు/ఆర్‌యూబీలు 32 మాత్రమే ఉండగా, తొమ్మిదేండ్లలోనే 28 నిర్మించడం విశేషం.
- తెలంగాణ ఏర్పాడే నాటికి రాష్ట్రంలో 2,511 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఆ తర్వాత 2,472 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను నిర్మించారు.

మోటర్ కథ మళ్లీ మొదటికి

- దేవాదుల టన్నెల్‌కు బీటలు
- భారీగా ఉబికివచ్చిన నీరు
- పంట పొలాలు ధ్వంసం
- అర్ధంతరంగా మోటర్ల నిలిపివేత

హనుమకొండ సబర్బన్, మార్చి 30 : జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా మూడో దశ మోటర్ నీటి సరఫరా మూడు రోజుల ముచ్చటగానే ముగిసింది. ధర్మసాగర్ రిజర్వాయర్‌లోని నీటి డెలివరీ సిస్టర్న్ కంటే 200 మీటర్ల ముందు నుంచి నిర్మించిన టన్నెల్‌కు భారీగా పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీరు టన్నెల్‌కు ఏర్పడిన పగుళ్ల నుంచి భారీ ఎత్తున ఉబికివచ్చాయి. వేగంగా వచ్చిన నీరు పక్కన పంట పొలాల్లోకి వెళ్లడంతో కొంత మేరకు ధ్వంసమయ్యాయి. ఆదివారం ఉదయం జరిగిన ఈ నీటి లీకేజీని గుర్తించిన రైతులు స్థానిక రిజర్వాయర్ సిబ్బందికి చెప్పడంతో వారు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే మోటర్‌ను అధికారులు నిలిపివేశారు. ఘటనా స్థలిని ఇంజినీర్లు పరిశీలించారు. ప్రమాద తీవ్రత భారీగానే ఉన్నట్టు గుర్తించారు. అయితే మరమ్మతులపై మాత్రం అధికారులు మౌనం వహిస్తున్నారు. ఎన్ని రోజుల్లో పునరుద్ధరించి పంపింగ్ ఎప్పుడు ప్రారంభిస్తామనేది మాత్రం చెప్పలేకపోతున్నారు. అయితే మరమ్మతు పనులను కాంట్రాక్టు ఏజెన్సీ చూసుకుంటుందని మాత్రం చెప్తున్నారు. ఇదిలావుండగా టన్నెల్ నిర్మాణంలో ఉన్న లోపాలే ప్రస్తుత ప్రమాదానికి కారణమనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రమాదం వల్ల చివరి దశలో ఉన్న పంటల పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చినట్టయిందని రైతులు వాపోతున్నారు.

భగీరథ ప్లాంటుకు తప్పిన భారీ ముప్పు

ధర్మసాగర్ రిజర్వాయర్ దిగువన 60 ఎంఎల్‌డీ, 25 ఎంఎల్‌డీ, 20 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (కెపాసిటీ గల డబ్ల్యూటీపీ) భారీ మూడు ప్లాంట్లను మిషన్ భగీరథ పథకంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. ఈ ప్లాంట్ల ద్వారా వరంగల్ నగరపాలక సంస్థతోపాటు 270 గ్రామాల దాహార్తి తీరుతుంది. ఆదివారం నాటి దేవాదుల టన్నెల్ నుంచి నీరు లీకైన ఘటనలో ప్రమాద తీవ్రతకు మిషన్ భగీరథ షీట్ ట్రాక్‌పై వేసిన దిమ్మెలకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరి కొంత సేపు మోటర్ నడిస్తే పైప్‌లైన్ ధ్వంసమయ్యేదని అధికారులు అంటున్నారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు సమీపంలో టన్నెల్ లీకవడంతో వృథాగా పోతున్న నీళ్లు

కేంద్రం సన్నబియ్యం ఎందుకు ఇయ్యలే?

కేంద్ర మంత్రి బండిపై మంత్రి సీతక్క ఫైర్

సూర్యాపేట టౌన్, మార్చి 30 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేండ్లు దాటినా సన్నబియ్యం ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు రాలేదో కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి కాంగ్రెస్ కరప్షన్ వైరస్ సోకిందని, రాష్ట్రంలో సన్నబియ్యం కేంద్రమే ఇస్తుందన్న బండి సంజయ్ వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. తెలంగాణలో నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలన్న బండి సంజయ్ బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

భద్రాద్రిలో తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి వసంత పక్ష తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినమైన ఆదివారం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పవిత్ర గోదావరి జలాలను తీర్థబిందెతో తెచ్చి నిత్యకల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అర్చన, ఉగాది ప్రసాద నివేదన చేశారు. మూలవరులకు అభిషేకం, నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి ఉత్సవాంగ స్నపనం గావించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీ సీతారామచంద్రమూర్తులను స్థానిక గోవిందరాజస్వామి వారి ఆలయం (తాతగుడి) లోకి తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా మత్స్యం గ్రహణం నిర్వహించారు. అనంతరం మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు.

– భద్రాచలం

సర్కారు బడుల్లో తగ్గారు.. ప్రైవేట్‌లో పెరిగారు!

- ప్రభుత్వ బడుల్లో తగ్గిన 3.6 లక్షల మంది విద్యార్థులు
- సర్కారు స్కూళ్లల్లో ఆందోళన కలిగిస్తున్న ఎన్‌రోల్‌మెంట్

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడులు గాడితప్పుతున్నాయి. ప్రభుత్వ అసమర్థ విధానాల కారణంగా ఆదరణ కోల్పోతున్నాయి. మూడేండ్లల్లో సర్కారు బడుల్లో 3,67,374 మంది ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది. మరీ ఆందోళన కలిగించే విషయమేంటంటే సర్కారు బడుల్లో తగ్గి.. ప్రైవేట్ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడం. రాష్ట్రంలో మొత్తం 30,137 ప్రభుత్వ బడులుండగా, 11,217 ప్రైవేట్ స్కూళ్లున్నాయి. ప్రైవేట్‌తో పోల్చితే రెండు రెట్లు అధికంగా సర్కారు బడులున్నాయి. ఎన్‌రోల్‌మెంట్ విషయానికి వస్తే సర్కారు బడుల్లో 25.13లక్షల విద్యార్థులుంటే, ప్రైవేట్‌లో 37.01లక్షల విద్యార్థులున్నారు.

- 2022-23లో సర్కారు బడుల్లో 28లక్షల మంది విద్యార్థులుంటే ఇప్పుడది 25లక్షలకు పడిపోయింది.
- అదే ప్రైవేట్‌లో 30లక్షల నుంచి 37లక్షలకు పెరిగారు. అంటే సర్కారులో 3.6లక్షలు తగ్గి, ప్రైవేట్‌లో 7లక్షలు పెరిగారు.
- రాష్ట్రం మొత్తంలో ఎన్‌రోల్‌మెంట్ పెరగడం విశేషం. 2022-23లో మొత్తం ఎన్‌రోల్‌మెంట్ 58.98లక్షలుండగా, 2024-25కు వచ్చేసరికి 62.15లక్షలకు పెరిగింది.
- ఈ మూడేండ్లల్లో మొత్తం ఎన్‌రోల్‌మెంట్ పెరగడం రాష్ట్రంలో పిల్లల జనన రేటు పెరుగుదలను సూచిస్తున్నది.

సంవత్సరం	2022-23	2023-24	2024-25
ప్రభుత్వ	28,80,809	26,36,630	25,13,435
ప్రైవేట్	30,17,877	34,05,430	37,01,814
మొత్తం	58,98,686	60,42,060	62,15,249

2 సెంటర్లు.. 74 మంది ర్యాంకర్లు

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తంచేస్తున్నారు. ఇందులో చాలా అక్రమాలు జరిగాయని చెప్తున్నారు. మెయిన్స్ మూడో ర్యాంకును నాన్ లోకల్ అభ్యర్థి ఎగరేసుకుపోయారు. టాప్ 10లో బీసీలు ముగ్గురు ఉంటే, మిగతా వారంతా ఓసీలే ఉన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఒక్కరు కూడా టాప్ 10లో లేరు. ఇక టాప్ -20లో ఒక ఒక్క ఎస్టీ అభ్యర్థి ఉండగా, ఎస్సీలు ఒక్కరు కూడా లేరు. ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం చేశారని ఆయా వర్గాల అభ్యర్థులు మండిపడుతున్నారు.

లికౌంటింగ్‌లో నో మార్క్స్!

ఇక రీ కౌంటింగ్ పెట్టుకున్న వారికి ఒక్క మార్కు కూడా పెరగలేదు. 20వ ర్యాంకును కూడా నాన్ లోకల్ అభ్యర్థే కైవసం చేసుకోవడం గమనార్హం. ఇలా గ్రూప్ -1 మెయిన్స్ మూల్యాంకనంపై అభ్యర్థులు పలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీలోని సెంటర్లలో పరీక్షలు రాసిన వారే టాపర్లుగా నిలిచారని ఆరోపిస్తున్నారు. కోఠి మహిళా కాలేజీలోని రెండు సెంటర్లలో పరీక్ష రాసిన వారిలో 74 మంది టాప్ 500లో నిలిచారు. ఉర్దూలో రాసిందే 9 మంది కాగా, ఓ మహిళా అభ్యర్థికి 18వ ర్యాంకు వచ్చింది. ఇదెలా సాధ్యమని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఫలితాల్లో ఒకే మార్కు మీద పదుల సంఖ్యలో అభ్యర్థులున్నారు. కొన్ని మార్కులపై 20 -30 మందిదాకా అభ్యర్థులుండటం గమనార్హం.

అశోక్‌నగర్‌లో పోస్టర్లు

తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని, మార్కులు తక్కువ వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి అశోక్‌నగర్‌లో పోస్టర్లు వెలిశాయి. 'టీజీపీఎస్సీని ఏలుతున్నది బహుజనులే అయినా బహుజనుల బతుకులు నాశనం' అంటూ వెలసిన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. 'గ్రూప్ -1లో పాడె మీదికి తెలుగు భాష'.. 'తెలంగాణ తెలుగోడా గ్రూప్ -1 అన్యాయంపై గొంతెత్తరా'.. 'తెలుగు భాష ప్రామాణికం కాదు- టీజీపీఎస్సీ', 'తెలుగులో రాస్తే నీ మెడకు ఉరి తాడే, తెలుగులో రాస్తే మార్కులు వేయం - టీజీపీఎస్సీ', 'తెలుగు భాష అంటే తన్నుడే - టీజీపీఎస్సీ', 'తెలుగుభాషను చంపుతున్నా పట్టించుకోని తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ' అని పేర్కొంటూ పోస్టర్లు వేశారు. టీజీపీఎస్సీ తీరును నిరిసిస్తూ నిరుద్యోగులు ఈ పోస్టర్లు వేసినట్టు నిరుద్యోగ జేఏసీ నేత జనార్ధన్ తెలిపారు.

మూల్యాంకనంలో అవకతవకలు

మెయిన్స్ మూల్యాంకనంలో అనేక అవకతవకలు జరిగినయి. పేపర్ -4 పర్యావరణం సబ్జెక్టును దిద్దేందుకు వాల్యుయేటర్లను పెట్టలేదు. ఒక్క జనరల్ ఎస్ఏ పేపర్‌ను దిద్దడానికి ఏడు సబ్జెక్టుల నుంచి అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు ఉండాలి. సైన్స్ అండ్ టెక్నాలజీకి 10 రకాల సబ్జెక్టు నిపుణులుండాలి. కానీ అనుభవం లేని డిగ్రీ లెక్చరర్లతో పేపర్లు దిద్దించారు. సెలవు దినాల్లో జీఆర్ఎల్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తున్నది.

– జనార్ధన్

జ్యుడీషియల్ విచారణ జరపాలి

మెయిన్స్ పరీక్షలు సహా ఫలితాల ప్రకటనలో టీజీపీఎస్సీ వైఖరి సందేహాస్పదంగా ఉన్నది. జీఆర్ఎల్ చూస్తుంటే ఇది గ్రూప్ -1 పరీక్షనా? లేక పదో తరగతి పరీక్షనా? అన్న సందేహాలు వస్తున్నాయి. రెండు సెంటర్ల నుంచే టాప్ 500లో 75 మంది ఉన్నారు. ఈ రెండు కేంద్రాల్లోనే అత్యధిక మార్కులు రావడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. మెయిన్స్ ఆన్సర్ షీట్లను తిరిగి మూల్యాంకనం చేయాలి. గ్రూప్ -1 రిక్రూట్‌మెంట్‌లో భారీ అక్రమాలు జరిగినట్టు తెలుస్తున్నది. గ్రూప్-1 రిక్రూట్‌మెంట్‌పై జ్యూడీషియల్ కమిషన్‌ను వేసి విచారణ జరపాలి.

– భరత్‌రెడ్డి

అభ్యర్థుల అభ్యంతరాలివే!

21,093 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరనట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. 20,161 పేపర్లకే మూల్యాంకనం చేశామంటున్నది. మరి 932 మంది పేపర్లు ఏమైనట్టు?

- మొత్తం 46 సెంటర్లు ఏర్పాటు చేస్తే 10 -15 సెంటర్ల నుంచే మొత్తం టాపర్లున్నారు. మిగతా సెంటర్ల నుంచి ఒక్కరంటే ఒక్కరూ లేరు. టాప్ 1000లో మూడు సెంటర్ల నుంచి ఒక్కరు కూడా లేరు. ఇదేలా సాధ్యం? ఒక సెంటర్ నుంచి 970 -950 మంది రాస్తే టాప్ 500లో ఒక్కరు లేకపోవడమేమిటి?
- టాప్ 500లో కోఠి మహిళా కాలేజీ సెంటర్‌లో రాసిన అభ్యర్థులే 75 మంది ఎంపిక.
- దాదాపు 9 వేల మంది లికౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు గడువు ఈ నెల 24తో ముగిసింది. ఒక్కో అభ్యర్థి నుంచి పేపర్‌కు వెయ్యి రూపాయల చొప్పున కమిషన్ వసూలు చేసింది. 24 నుంచి ఆదివారం వరకు అంటే 6 రోజుల్లో 9 వేల మంది లి కౌంటింగ్ ఎలా సాధ్యం? పైగా లి కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఎవరికీ ఒక్క మార్కు కూడా పెరగలేదు.
- రెగ్యులర్ ఫ్యాకల్టీ చేత మూల్యాంకనం చేయించారన్నది పూర్తిగా అవాస్తవం. పదేండ్ల క్రితం రిటైర్ అయిన వారు, కాంట్రాక్ట్ లెక్చరర్ల చేత మూల్యాకంనం చేయించారని అభ్యర్థుల ఆరోపణ.
- సివిల్స్‌లో 50 శాతం మార్కులొస్తే ఐఏఎస్, ఐపీఎస్ ఉద్యోగాలొస్తున్నాయి. కానీ గ్రూప్ -1లో 500 కంటే ఎక్కువ మార్కులొచ్చిన వారు 52 మంది ఉంటే, 450 మార్కుల కంటే ఎక్కువ సాధించిన వారు 618 మంది ఉన్నారు. ఇష్టారీతిన మార్కులు వేశారనేందుకు ఇదే నిదర్శనం.
- టీజీపీఎస్సీ గ్రీవెన్స్‌సెల్‌ను వెయ్యి మంది ఆశ్రయిస్తే ఇప్పటి వరకు ఒక్కరికీ సమాధానమివ్వలేదు.
- టాప్ 100, టాప్ 500లో ఒక్క తెలుగు మీడియం అభ్యర్థి కూడా లేరు.
- హైకోర్టు అడ్వకేట్లు కొందరు గ్రూప్ -1పై కేసులు టేకప్ చేసేందుకే జంకుతున్నారు. తమకు పైనుంచి ఆదేశాలున్నాయని, కేసు తీసుకోలేమని కరాకండిగా చెప్తున్నారు.

'వాహన్ సారథి' పోర్టల్‌కు 'గ్రహణం'

- సేవల ప్రారంభానికి కుదరని 'ముహూర్తం'
- తీరిక లేదంటున్న రవాణా శాఖ మంత్రి
- 2 నెలల నుంచి అధికారుల ఎదురుచూపు
- తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో 3 నెలల క్రితమే ముగిసిన పైలట్ ప్రాజెక్టు
- ఇప్పుడు మళ్లీ ఎన్నికల కోడ్‌తో తప్పని నిరీక్షణ
- త్వరలో తిరుమలగిరి ఆర్టీవోకూచ్చివేత
- ఇక ఆ పోర్టల్ ప్రారంభం ఇప్పట్లో లేనట్టే

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 30 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఒకే తరహా ఆర్‌సీ, డీఎల్ ఉండేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వాహన్ సారథి' పోర్టల్ సేవలను రాష్ట్రంలో అందుబాటులోకి తెచ్చేందుకు 'గ్రహాలు' అనుకూలించడం లేదు. ప్రభుత్వ 'పెద్దల'కు తీరిక లేకపోవడంతో ఆ పోర్టల్ ప్రారంభోత్సవానికి 'ముహూర్తం' కుదరడం లేదు. 'వాహన్ సారథి' పోర్టల్ అమలు కోసం సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయం ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా చేపట్టిన కార్యక్రమం (పైలట్ ప్రాజెక్టు) నిరుడు డిసెంబర్‌లోనే ముగిసింది. దీంతో ఆ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'వాహన్ సారథి' సేవలను ప్రారంభించేందుకు రవాణా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ, ఆ సేవలను ప్రారంభించేందుకు రవాణా శాఖ మంత్రి ఈ గత 3 నెలల నుంచి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. దీనిపై ఉన్నతాధికారులు ఆ మంత్రిని సంప్రదించగా.. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిద్దామని చెప్పినట్టు తెలిసింది. దీంతో మంత్రి అపాయింట్‌మెంట్ దొరకడమే గగనమైపోతే ఇక సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి ఈ పోర్టల్‌ను ప్రారంభించడం ఇప్పట్లో జరిగేదేనా? అని అధికారులు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి ఈ నెల 9 నుంచే రాష్ట్రవ్యాప్తంగా 'వాహన్ సారథి' సేవలను అందుబాటులోకి తెస్తామని, తదనుగుణంగా ఆ పోర్టల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ప్రకారంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ ఇంకా ఆ సేవలు ప్రారంభం కాలేదు. దీంతో విసిగిపోయిన అధికారులు.. కనీసం రవాణా శాఖ మంత్రివర్యులైనా 'వాహన్ సారథి' పోర్టల్‌ను ప్రారంభిస్తే బాగుంటుందని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు హైదరాబాద్‌లో మళ్లీ ఎన్నికల కోడ్ అ